క్లుప్తంగా

చలివేంద్రాల ఏర్పాటు



కుశాలపురంలో ప్రారంభించిన చలివేంద్రం

ఎచ్చెర్ల క్యాంపస్: వేసవి తీవ్రత నేపథ్యంలో కుశాలపురం గ్రామానికి చెందిన అక్షయ సేవా సమితి ఆధ్వర్యంలో జాతీయ రహదారికి అనుకుని ఆదివారం చలివేంద్రాలను ప్రారంభించారు. చిలకపాలెం, ఎచ్చెర్ల, కేశవరావుపేట, ఎస్ఎంపురం, సింహద్వారం జాతీయ రహదారికి అనుకుని ఉన్న ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. సేవా సమితి అధ్యక్షుడు బి.మధు మాట్లాడుతూ శుద్ధిజలాలు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. సంస్థ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

చదవడం మాకిష్టం



బహుమతులతో విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: ధర్మవరం గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో కథలు పుస్తకాలు, వేమన, సుమతీ శతకాలు చదివించారు. ప్రతిభ ఆధారంగా విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పుస్తకాలు, పాఠశాల విద్యార్థులకు ఉపయోగపడే పుస్తకాలను గ్రంథాలయ అధికారి మలిపెద్ది చంద్రశేఖర్ వివరించారు. వేసవి సెలవుల్లో గ్రంథాలయాన్ని ఉపయోగించుకుని విజ్ఞానాన్ని పొందాలని సూచించారు.

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం



కొచ్చెర్ల గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ రామచంద్రరావు

రణస్థలం: ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణే పోలీసుల ప్రధాన లక్ష్యమని జే.ఆర్.పురం సీఐ జి.రామచంద్రరావు తెలిపారు. మండలంలోని కొచ్చెర్ల గ్రామంలో సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా శాంతిభద్రతలపై ఆదివారం అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఓటు హక్కును వినియోగించుకోవడం ప్రజాస్వామ్యం ఇచ్చిన హక్కు అని, ఎటువంటి ప్రలోభాలకు లోనుకావద్దన్నారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎచ్చెర్ల, జే.ఆర్.పురం ఎస్ఐలు చిరంజీవి, కె.గోవిందరావు, సిబ్బంది పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణం



పారాయణ చేస్తున్న చిన్నారులు

శ్రీకాకుళం కల్చరల్: చిన్మయమిషన్ నిర్వాహకులు పరాత్మానంద సరస్వతీ స్వామి ఆధ్వర్యంలో బలగలోని హరే రామ మందిరంలో ఆదివారం చిన్నారులచే హనుమాన్ చాలీసా పారాయణ జరిగింది. ఇక్కడ బాలవిహార్ కార్యక్రమం ప్రతి ఆదివారం నిర్వహిస్తున్నామని ఎవరైనా తమ పిల్లలను ఇక్కడి పంపవచ్చని చిన్మయా మిషన్ ప్రతినిధి కూనపులి వెంకటేశ్వరులు తెలిపారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



కారును తనిఖీ చేస్తున్న సీఐ రామచంద్రరావు, సిబ్బంది

రణస్థలం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా అంతర్ చెక్ పోస్టు పైడిభీమవరం వద్ద జే.ఆర్.పురం సీఐ జి.రామచంద్రరావు ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు. విజయనగరం జిల్లా నుంచి శ్రీకాకుళం జిల్లాలోకి ప్రవేశించే ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. రూ.50 వేలకు మించి నగదు వెంట తీసుకువెళ్తే సరైన ఆధారాలు చూపించాలన్నారు. తనిఖీల్లో జే.ఆర్.పురం ఎస్సై కె.గోవిందరావు, సిబ్బంది ఉన్నారు.

సీఎం జగన్‌తోనే ఉద్యోగాల విప్లవం

- మంత్రి ధర్మాన ప్రసాదరావు



మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్యోగాల విప్లవాన్ని తీసుకొచ్చారని రెవెన్యూశాఖమంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నగరంలోని బ్యాంకర్స్ కాలనీలో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వలంటీర్ల సహకారంతో సర్టిఫికెట్లు, రేషన్‌కార్డు, పింఛన్లు ఏం కావాల్సిన ఇంటివద్దకే తీసుకొచ్చి ఇచ్చేవారన్నారు. గత టీడీపీ సర్కార్ హయాంలో ఎలాంటి సర్టిఫికెట్ కావాలన్నా ప్రజలు చాలా ఇబ్బందులు పడేవారని గుర్తు చేశారు. విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చి కార్పొరేట్‌కు దీటుగా పేదలకు ఇంగ్లిష్ మీడియం విద్యను అందించి ప్రపంచంతో పోటీపడేలా సీఎం జగన్ చేశారన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు ఎనలేని ప్రాధాన్యం కల్పించారన్నారు. జిల్లాలో రూ. 4 వేల కోట్లతో మూలపేట పోర్టు, రూ. 800 కోట్లతో ఉద్దానం మంచినీటి ప్రాజెక్టు, పలాసలో కిడ్నీ రిసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. ఇవన్నీ అభివృద్ధి కాదా అని ప్రశ్నించారు. చంద్రబాబు 40 ఏళ్ల ఇండస్ట్రీలో ఉత్తరాంధ్రాలో ఒక్క శాశ్వత ప్రాజెక్టును కూడా నిర్మించలేదన్నారు. కరోనా కష్ట సమయంలో కూడా ప్రజలకు ఇబ్బందిలేకుండా చూశామన్నారు. కార్యక్రమంలో తూర్పుకాపు, కళింగవైశ్య కార్పొరేషన్ల చైర్మన్లు మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు, డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణ, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఎం.వి.స్వరూప్, నాయకులు మండవల్లి రవి, అట్టాడ అప్పలనాయుడు, ప్రొఫెసర్ విష్ణుమూర్తి, కద్దాల శ్యామ్, మంజుల, కొండాల గణేష్, కరణం శ్రీను ఉన్నారు.

ఆర్యవైశ్యులు సేవాతత్పరులు

- మంత్రి ధర్మాన ప్రసాదరావు



భాస్కరరావుకు జ్ఞాపిక అందజేస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఆర్యవైశ్యులు తమ సంపాదనలో కొంతమేర వెచ్చించి దాన, ధర్మాలు చేస్తూ సమాజ సేవచేయాలన్న దృక్పథంతో ఉన్న సామాజికవర్గమని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. గత నెలలో తమ్మిన భాస్కరరావుకి ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. ఈ నేపథ్యంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం పట్టణంలోని అవోపా కల్యాణ మండపంలో ఆదివారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించి భాస్కరరావును ఘనంగా సత్కరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ధర్మాన మాట్లాడుతూ.. ఆర్యవైశ్యులు ఆధ్యాత్మిక భావాలు కలిగిన వ్యక్తులని.. దేశంలో అనేక చోట్ల ట్రస్టులు నడుపుతున్నారన్నారు. ఆర్యవైశ్యులు నడిపే ట్రస్టులు చాలా క్రమశిక్షణగా ఉంటాయని చెప్పారు. తాను చాలా ట్రస్టులను స్వయంగా చూశానని, అక్కడ సమయాన్ని వెచ్చించడం చాలా ఆనందంగా ఉంటుందన్నారు. అందరి అభిమాని మండవల్లి రవి మీ కులానికి నాకు మధ్య వారధిలా ఉన్నారన్నారు. ఎవ్వరికి ఎప్పుడు ఏ అవసరం వచ్చినా నేనుంటానని హామీ ఇచ్చారు. తమ్మిన భాస్కర్ సమర్థవంతంగా పనిచేయగలరనే నమ్మకంతో ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించారన్నారు. ప్రతి రోజు నాకోసం మీ సపరిచితులకు ఓ మంచి మాట చెప్తున్నట్లు విన్నానని..ఇది ఎంతో ఆనందాన్ని ఇస్తుందన్నారు. భాస్కరరావును దుశ్శాలువతో సత్కరించి మెమెంటో అందించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘ నాయకులు మండవల్లి రవి, మండవల్లి గుప్త, పూసర్ల నగేష్, బలబత్తుల సత్య, శ్రీకాంత్, పేర్ల రమేష్, ప్రముఖ ఇంజినీర్ అచంటి రాము ఉన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో ప్రత్యేక పూజలు



సూర్యనమస్కార పూజలు చేస్తున్న దృశ్యం



మహాలింగార్చనలో అర్చకులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణస్వామి వారి సన్నిధిలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి ఇష్టమైన వారం కావడంతో ఇతర ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చి ఆరోగ్యప్రదాత ఆదిత్యునికి విశేష పూజలను, మొక్కులను చెల్లించుకున్నారు. వేసవి తీవ్రత నుంచి భక్తులకు ఇబ్బందులు లేకుండా మంచినీటిని, మజ్జిగను, చిన్నారులకు బిస్కెట్లను, పాలను పంపిణీ చేసేలా ఆలయ అధికారులు చర్యలు చేపట్టారు. అంతరాలయంలో స్వామి వారికి ప్రత్యేక అలంకరణలతో సర్వదర్శనాలకు ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ చర్యలు చేపట్టారు. ఆరోగ్యం కోసం తలనీలాలను కొందరు భక్తులు సమర్పించగా, మరికొందరు ఆరోగ్యం కోసం సూర్యనమస్కారాల పూజలను చేయించుకున్నారు. ఆలయ మండపంలో రూ.300, ఇంద్రపుష్కరిణి మార్గంలో రూ.100 చొప్పున టిక్కెట్లను విక్రయించగా..భక్తులు పూజలు చేయించుకున్నారు. అన్న ప్రసాదాన్ని సుమారు 800 మంది వరకు భక్తులు స్వీకరించారు.

అనివెట్టి మండపంలో మహాలింగార్చన

మాసశివరాత్రి సందర్భంగా ఆదివారం ఉదయం అనివెట్టి మండపంలో మహాలింగార్చన కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో మహాపర్వం శివ పంచాయతన సహిత మహాలింగార్చనను అర్చకులు ఇప్పిలి సాందీప్‌శర్మ అర్చనాభిషేకాలను చేశారు.

పరామర్శ



అంకమ్మ కుమారుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ నేదూరిపేటకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త బస్వ అంకమ్మ కుమారుడు ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ఆదివారం నేదూరిపేటకు వెళ్లి పరామర్శించారు. వేగంగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో కాగితాల కృష్ణారెడ్డి, పార్టీ నాయకులు కొల్లి రమణ, బాసి రామారావు, బోర రాజారావు, పట్నాన రామారావు, జీరు రాంబాబు ఉన్నారు.

ఫ్లాగ్‌మార్చ్



జే.ఆర్.పురంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు, కేంద్ర బలగాలు

రణస్థలం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని జే.ఆర్.పురం సీఐ జి.రామచంద్రరావు అన్నారు. శ్రీకాకుళం డీఎస్పీ శాంతి ఆదేశాల మేరకు మండలంలోని జీరుపాలెం, జే.ఆర్.పురం గ్రామాల్లో కేంద్ర రక్షణ బలగాలు, సివిల్ పోలీసులు ఆదివారం ప్రజా చైతన్యం కల్పిస్తూ పోలీస్ కవాతు నిర్వహించారు. ఎన్నికల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా, ఎన్నికల విధులకు ఆటంకం కల్పించినా క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి



మాట్లాడుతున్న సీఐ సన్యాసినాయుడు

శ్రీకాకుళం రూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని శ్రీకాకుళం టౌన్ సీఐ సన్యాసినాయుడు కోరారు. కనుగులవానిపేట గ్రామస్తులతో ఆదివారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. మే 13వ తేదీన జరగబోయే పోలింగ్‌కు సంబంధించి ఎటువంటి తగాదాలకు పోకుండా అందరూ కలిసికట్టుగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. పోలీసులకు, ఎన్నికల అధికారులకు సహకరించాలని కోరారు. ఎక్కడైనా మద్యం, డబ్బులు తరలింపు, పంపకాలు ఉంటే సమాచారం అందివ్వాలన్నారు.

రాగోలు రోడ్డుకు మరమ్మతులు చేయాలని ధర్నా

శ్రీకాకుళం రూరల్: అధ్వానంగా ఉన్న రాగోలు–వాకలవలస రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతూ స్థానిక న్యాయవాది పైడి విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో పలు గ్రామాల ప్రజలు ఆదివారం ఉదయం ధర్నా చేపట్టారు. రోడ్డు బాగోకపోవడంతో ఇప్పటి వరకూ సుమారు 30 మంది వరకూ మృత్యువాత పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డును బాగు చేసి సమస్యను పరిష్కరించాలని కోరారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమం



రణస్థలం: ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: సీఎం జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న ప్రజా సంక్షేమ పాలన ఇంటింటికీ చేరాలంటే ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని రణస్థలం పంచాయతీలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సీఎం జగన్ పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. మీ ఇంటికి మేలు జరిగితేనే ఓటు వేయమని నిజాయితీగా అడిగే దమ్మున్న నాయకుడు సీఎం జగన్ అని అన్నారు. సీఎం జగన్ పేదల బాగుకోరుకుంటే.. చంద్రబాబు వాళ్ల కార్యకర్తలు, నాయకుల బాగుకోసమే పార్టీ పెట్టారన్నారు. టీడీపీ నాయకుల మాయమాటలు నమ్మవద్దన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందజేసి దేశంలోనే నంబర్ వన్ సీఎంగా జగన్ నిలిచారన్నారు. అమ్మ ఒడి, ఆసరా, చేయూత, విద్యా కానుక వంటి సంక్షేమ పథకాలు, ఎన్నో అభివృద్ధి పనులు సీఎం జగన్ హయంలోనే జరిగాయన్నారు. చంద్రబాబు 14 ఏళ్ల పాలనలో ఒక్క మంచి పథకమైనా చూపగలరా అని టీడీపీ నాయకులను ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, లంకలపల్లి ప్రసాద్, మాజీ సర్పంచ్‌లు పిన్నింటి లక్ష్మంనాయుడు, కరిమజ్జి భాస్కరరావు, మహంతి జోగినాయుడు, చందక రమణ, గురునాయుడు, సురేష్, వైస్ ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్పొరేషన్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

కూటమికి తగిన గుణపాఠం చెప్పాలి



జి.సిగడాం: నిద్దాంలో వృద్ధురాలితో మాట్లాడుతున్న పరిమళ

జి.సిగడాం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు పేదలకు అందకుండా కుట్రలు చేస్తున్న చంద్రబాబుకు, కూటమి నాయకులకు రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ సతీమణి, మాజీ ఎంపీపీ పరిమళ అన్నారు. ఆదివారం సాయంత్రం మండలంలోని నిద్దాం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండలం నుంచి అధిక్య మెజార్టీ రావాలన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి జగనన్నను సీఎంను చేద్దాం అంటూ నినాదాలు చేశారు. ఎంపీపీ మీసాల సత్యవతి, వైస్ ఎంపీపీలు మీసాల సాదీవ్రమణి, తోలేటి వెంకటరావు, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, మండల బూత్ కన్వీనర్ అబోతుల జగన్నాథం, మండల మహిళా కన్వీనర్లు కంది రమాదేవి, గురాన మానస, మండల వ్యవసాయశాఖ సలహా మండలి చైర్మన్ మక్క వెంకటసాయి, డోల వెంకటరమణ, మీసాల రాంబాబు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వాన ప్రమీల, పీఏసీఎస్ చైర్మన్లు ఎర్నేన ప్రకాశరావు, పల్లేడ సన్యాసిరావు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ సురేష్

శ్రీకాకుళం అర్బన్: ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించడం ద్వారా సమాజం కూడా ఆరోగ్యకరంగా ఉంటుందని ప్రముఖ వైద్యుడు, లయన్ డాక్టర్ బొడ్డేపల్లి సురేష్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆర్ట్స్ కళాశాల రోడ్డులోని సన్‌రైజ్ ఆస్పత్రిలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు వందమందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. వైద్యులు మాట్లాడుతూ.. చిన్న అనారోగ్య సమస్య ఉన్నా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, వాకింగ్‌ను అలవాటు చేసుకోవాలని అన్నారు ఎండల తీవ్రత ఉన్న నేపథ్యంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఒత్తిడిని తగ్గించుకుంటూ మానసిక ప్రశాంతత కోసం ధ్యానం, యోగ వంటివి సాధన చేయాలన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షుడు పొన్నాడ రవికుమార్, మెంటార్ నటుకుల మోహన్, జోన్ చైర్మన్ బాడాన దేవభూషణరావు పాల్గొన్నారు.

చంద్రబాబు మాయమాటలు నమ్మకండి

- మంత్రి ధర్మాన సతీమణి గజలక్ష్మి



ఇంటింటా ప్రచారంలో ధర్మాన గజలక్ష్మి తదితరులు

శ్రీకాకుళం రూరల్: చంద్రబాబు మాయమాటలను ఎవ్వరూ నమ్మవద్దని రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు సతీమణి గజలక్ష్మి కోరారు. సానివాడ గ్రామంలో ఆమె ఇంటింటా ఎన్నికల ప్రచారాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరపున శ్రీకాకుళం నియోజకవర్గం అభ్యర్థిగా మంత్రి ధర్మాన పోటీ చేస్తున్నారని.. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. భవిష్యత్ తరాలు బాగుండాలన్నా, నవరత్నాలను తీసుకురావాలన్నా ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి అందరం కలిసికట్టుగా గెలిపించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబటి నిర్మల, పార్టీ నాయకుడు శ్రీనివాస్, జెడ్పీటీసీ సభ్యురాలు రుప్ప దివ్య, మూకళ్ల సుగుణ, రుప్ప లక్ష్మి, కంచు రమణమ్మ, దుండు శార్వాణి, పొన్నాన కోటీశ్వరి, ఉంగటి కుమారి ఉన్నారు.

వైఎస్సార్‌సీపీని గెలిపించుకుందాం



ధర్మాన నాయకత్వాన్ని బలపరుస్తామంటున్న ఎస్సీ కుటుంబాలు

శ్రీకాకుళం రూరల్: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గెలుపించుకుందామని ఎస్సీ కులాల జిల్లా అధ్యక్షుడు పొన్నాడ రుషి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని పాత్రునివలస గ్రామాన్ని ఆయన ఆదివారం సందర్శించారు. ఈసందర్భంగా స్థానికంగా ఉన్న 62 కుటుంబాలతో మమేకమై శ్రీకాకుళం నియోజవకర్గ అభ్యర్థి ధర్మాన ప్రసాదరావుకు మనమంతా మద్దతు ఇవ్వాలని కోరారు. ఐదేళ్లలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని వారికి వివరించారు. ఎన్నికల సమయం కావడంతో టీడీపీ నాయకులు అనేక ప్రలోభాలకు గురిచేస్తారని.. వారి మయామాటలను ఎవ్వరూ నమ్మవద్దన్నారు. సీనియర్ నాయకుడు కళ్లేపల్లి రామ్‌గోపాల్, స్థానిక పార్టీ నాయకులు గాంధీ, అసిరినాయుడు, దాలినాయుడు ఉన్నారు.

యోగా, ధ్యానంతో మంచి ఆరోగ్యం



శ్రీకాకుళం కల్చరల్: ఆరోగ్య దినోత్సవంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: మంచి ఆరోగ్యం కోసం యోగా సాధన, ధ్యానం, సత్సంగం, సేవ చేయడం ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని ఆర్ట్ ఆఫ్ లివింగ్ జిల్లా ప్రతినిధి డాక్టర్ కె.అమ్మన్నాయుడు అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పెద్దపాడు రోడ్డులోని ఆర్ట్ ఆఫ్ లివింగ్ కేంద్రంలో ప్రత్యేక హ్యాపినెస్ కార్యక్రమం ఆదివారం జరిగింది. టీచర్ దేసూళ సురేంద్ర మాట్లాడుతూ.. సుదర్శన క్రియ సాధన వలన మానసిక ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయని అన్నారు. వర్తమాన కాలంలో జీవించాలంటే మనిషి ఆనందంగా ఉండాలని టీచర్ టి.అరుణకుమారి అన్నారు. ఈ సందర్భంగా ఎపెక్స్ బాడీ సభ్యులు గీతా శ్రీకాంత్‌ను ఘనంగా సత్కరించారు. అలాగే భక్తి గీతాల కార్యక్రమంలో చౌదరి శ్రీనివాస్, ఉమాదేవి, కొరారి రేణుక బృందం పాడిన గీతాలు ఆకట్టుకున్నాయి.

మెడికవర్‌లో..



అరసవల్లి: అవగాహన సదస్సులో మెడికవర్ వైద్యులు, సిబ్బంది

అరసవల్లి: నా ఆరోగ్యం–నాహక్కు నినాదంతో ఈ ఏడాది ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని.. మారుతున్న జీవనశైలి, ఆహార అలవాట్లు కారణంగా ఆరోగ్య పరిరక్షణపై అందరికీ అవగాహన అవసరమని మెడికవర్ వైద్యులు సూచించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా నిర్వహించిన అవగాహన సదస్సులో వైద్యులు అమూల్య, దానేటి శ్రీధర్, భానుకుమార్ తదితరులు మాట్లాడారు. విటమిన్స్, ఖనిజాలు, ప్రోటీన్లు, కార్బోహైడ్రేట్స్ తగినంతగా ఉన్న ఆహారం తీసుకోవాలని సూచించారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో ఎస్సై వాసుదేవరావు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధి కళ్లేపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి ఎక్సైజ్ సిబ్బంది, రూరల్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.7,800 విలువ చేసే మద్యం బాటిళ్లను పట్టుకున్నామని రూరల్ ఎస్ఐ వాసుదేవరావు తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

నడకే దివ్య ఔషధం



మాట్లాడుతున్న డాక్టర్ గౌతమి

శ్రీకాకుళం అర్బన్: ఆరోగ్యమే మహాభాగ్యం నినాదం పాతదే అయినా.. అదే ఇప్పుడు అందరికీ దిక్సూచిగా మిగిలిందని శ్రీకాకుళం నగరానికి చెందిన ప్రముఖ మూత్ర పిండాల వ్యాధి నిపుణురాలు డాక్టర్ బెండాళం గౌతమి అన్నారు. శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్, ప్రజారోగ్య పరిరక్షణ కమిటీ సారథ్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ ఏడాది 'నా ఆరోగ్యం–నా హక్కు'నినాదంతో ప్రపంచ వ్యాప్తంగా ఆరోగ్య దినోత్సవాన్ని జరుపుకుంటున్నారన్నారు. సంపూర్ణ ఆరోగ్యానికి ఆహారపు అలవాట్లే కీలకమన్నారు. ప్రతిఒక్కరూ శారీరక శ్రమతో పాటు నడక, వ్యాయామం, యోగా చేయాలని, సమయానికి ఆహారం తీసుకోవటం, తగినంత నీరు తాగడం వల్ల అనేక రకాల వ్యాధులకు చెక్ పెట్టవచ్చునని చెప్పారు. జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. అంతర్జాతీయ నడక సంఘం మాజీ గవర్నర్ జి.ఇందిరాప్రసాద్ మాట్లాడుతూ.. సంపూర్ణ ఆరోగ్యానికి నడక సంఘాలు ఇతోధికంగా సేవలు దిస్తున్నాయన్నారు. ఆర్ట్స్ కళాశాల ఎన్‌సీసీ అధికారి డాక్టర్ వై.పోలినాయుడు, మహిళా విభాగం ఎన్‌సీసీ అధికారులు బి.వరలక్ష్మి, పావని, స్టార్ వనితా నడక సంఘం అధ్యక్షురాలు జి.లక్ష్మి, స్టార్ వాకర్స్ క్లబ్ కార్యదర్శి బి.దేవీప్రసాద్, నడక సంఘాల ప్రతినిధులు డాక్టర్ జి.నారాయణరావు, నాగేశ్వర ఈశ్వరరావు, ఎం.మల్లిబాబు, వై.మోహన్, జి.ఆనందరావు, జి.వాసు మాస్టర్, పాలకొండ ప్రశాంత్, పి.నాగేశ్వరరావు, మహిళా ప్రతినిధులు వాసంతి, రాంబాయి ఉన్నారు.